క్లుప్తంగా

విద్యుత్ లైన్‌కు మరమ్మతులు



విద్యుత్ తీగలకు మరమ్మతులు చేస్తున్న లైన్‌మన్

కొనకనమిట్ల: మండలంలోని సలనూతల గ్రామంలో శనివారం కురిసిన వర్షానికి శివాలయం వెళ్లే రహదారిలో విద్యుత్ తీగలు తెగి కిందపడ్డాయి. స్థానికులు సమాచారం అందించడంతో విద్యుత్ అధికారులు హుటాహుటిన జంపర్లు తప్పించి సరఫరాను నిలుపుదల చేశారు. ఆదివారం లైన్‌మెన్లు రమేష్‌బాబు, నారాయణ తెగిపడిన విద్యుత్ తీగల స్థానంలో కొత్త తీగలు అమర్చి సరఫరాను పునరుద్ధరించారు.

ఫొటోగ్రాఫర్‌కు సన్మానం



కృష్ణను సన్మానిస్తున్న ఓల్డ్ అసోసియేషన్ సభ్యులు

పొదిలి రూరల్: పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ ఓల్డ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పొదిలికి చెందిన లక్ష్మీ శ్రీనివాస స్టూడియో నిర్వాహకుడు శ్రీకృష్ణను ఘనంగా సన్మానించారు. స్టూడియో ఏర్పాటు చేసి 25 ఏళ్లు అయిన సందర్భంగా సన్మానించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ రావూరి శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, సభ్యులు ప్రసాద్, శ్రీను,వెంకటేశ్వర్లు, మల్లి, సిలోన్, శ్రీధర్, బంగారు, సిలార్, శివ, రాజు, అజయ్, సూరి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య శిబిరం నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పొదిలి రూరల్: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీ సుప్రజ సూచించారు. పొదిలి నగరం పంచాయతీలోని బుచ్చనపాలెంలో ఆదివారం వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు విజయ, రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సబ్ కలెక్టర్



ఆలయంలో పూజలు చేస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: మార్కాపురం రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్‌గా సహదిత్ వెంకట త్రివినాగ్ ఆదివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బందితోపాటు తహసీల్దార్ చిరంజీవి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, పలువురు రెవెన్యూ అధికారులు నూతన సబ్‌కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. త్రివినాగ్ విజయనగరం జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఇప్పటి వరకు మార్కాపురం సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన రాహుల్ మీనా కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

గిద్దలూరు రూరల్: సీపీఎస్, జీపీఎస్ కాకుండా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.సుబ్బారాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. జీవో నం.117ను రద్దు చేయాలని, పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం సమాంతరంగా ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు మూర్తయ్య, దస్తగిరి, పి.వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఎస్.రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డిలో ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. సోమవారం ఎవరైనా పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హెచ్చరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



మార్కాపురం సమీపంలో నిండుగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ



కె.ఎస్.పల్లె వద్ద వాగులో కొట్టుకొచ్చిన వన్యప్రాణి కలేబరం

ఉధృతంగా గుండ్లకమ్మ.. ఉప్పొంగిన సగిలేరు



తిప్పాయపాలెం గ్రామంలో చేరిన వరద నీరు


- ఎడతెరపి లేని వర్షంతో పొంగిపొర్లిన వాగులు
- జలకళను సంతరించుకున్న కంభం చెరువు
- కంభం, రాచర్ల, మార్కాపురం మండలాల్లో నీట మునిగిన పంటలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



గొట్లగట్టులో పంచాయతీ కార్యాలయం వద్ద నిలిచిన నీరు



కంభం : యర్రబాలెం వద్ద నీట మునిగిన పత్తి



కంభం : తురిమెళ్ల వద్ద నీట మునిగిన పొలాలు

మార్కాపురం: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో గత మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగూవంకలు పొంగిపొర్లాయి. పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో శుక్రవారం రాత్రి ప్రారంభమైన వాన శనివారం అర్ధరాత్రి వరకు కురిసింది. ఆదివారం ఉదయం 10 గంటల వరకు తెరపిచ్చిన వాన మళ్లీ 2 గంటల వరకు కురిసింది. మార్కాపురం ప్రాంతంలో గుండ్లకమ్మ, జువ్వలేరు, తీగలేరు, దువ్వలేరు, ఉప్పు వాగులన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. కంభం చెరువుకు జలకళ వచ్చింది. రాచర్ల మండలంలోని నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయం వద్ద ఉన్న నెమలిగుండానికి కూడా భారీగా వరద నీరు చేరింది. మార్కాపురం మండలం బొడిచర్ల, నాగులవరం వద్ద బ్రిడ్జిని తాకుతూ గుండ్లకమ్మ ప్రవహించింది. గత కొన్ని నెలలుగా ఎండిపోయిన గుండ్లకమ్మకు వరద నీరు రావడంతో జలకళ సంతరించుకుంది. వేములకోట, నాగులవరం చెరువులకు నీళ్లు చేరాయి. కాగా గుండ్లకమ్మకు వచ్చే నీరు మార్కాపురం చెరువుకు రాకుండా వృథాగా వెళ్తోంది. సప్లయ్ ఛానల్‌లో పూడిక తీయకపోవడంతో చెరువుకు నీరు చేరడం లేదు.

తిప్పాయపాలెంలో వరద సహాయక చర్యలు

మార్కాపురం/మార్కాపురం రూరల్: మండలంలోని తిప్పాయపాలెం గ్రామంలోకి వరద నీరు చేరింది. ఆదివారం ఉదయం గ్రామస్తులు నిద్ర లేచే సరికి నివాసాల ముందు మోకాళ్ల లోతు నీరు నిలిచి ఉండటంతో ఆందోళన చెందారు. వీఆర్‌ఓ స్పందించి జేసీబీ సాయంతో వరద నీటిని బయటకు మళ్లించారు. భారీ వర్షానికి కుంట, కోలభీమునిపాడు, తిప్పాయపాలెం, చింతగుంట్ల గ్రామాల్లో పత్తి, మిర్చి ఇతర పంటలు నీటమునిగాయి.

కొనకనమిట్ల: కొనకనమిట్ల మండలంలో గత రెండు రోజుల్లో 92.4 మి.మీ వర్షపాతం నమోదైంది. గొట్లగట్టు బస్టాండ్‌సెంటర్, పంచాయతీ కార్యాలయం మార్గంలో వర్షం నీరు భారీగా నిలిచింది.

సగిలేరుకు భారీగా నీరు

గిద్దలూరు రూరల్: నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షాలతో దిగువమెట్ట వద్ద సగిలేరు వాగు ఉప్పొంగింది. కె.ఎస్.పల్లె సమీపంలోని బీమలింగేశ్వరస్వామి ఆలయంలో సమీపంలో, గిద్దలూరు పట్టణంలోని నంద్యాల బ్రిడ్జి, పోరుమామిళ్ల బ్రిడ్జి మీదుగా వాగు ఉధృతంగా పారింది. నల్లమల అటవీ ప్రాంతంలో మృతి చెందిన కొన్ని వన్యప్రాణులు నీటిలో కొట్టుకుని వచ్చాయి. కె.ఎస్.పల్లె సమీపంలో వాగు ఉధృతిని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గిద్దలూరు పట్టణంలోని కొన్ని వీధులు వర్షం ధాటికి మురుగుమయమై ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు.

పోటెత్తిన గుండ్లకమ్మ, జంపలేరు

కంభం: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుండ్లకమ్మ, జంపలేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తురిమెళ్ళ, యర్రబాలెం, పెద్దనల్లకాల్వ వద్ద పంట పొలాలు నీటమునిగాయి. ఉధృతంగా పారుతున్న గుండ్లకమ్మ వాగు వద్ద కంభం ఎస్సై బి.నరసింహారావు బందోబస్తు ఏర్పాటు చేశారు. మార్కాపురం ఏడీఏ బాలాజి నాయక్ సిబ్బందితో కలిసి నీట మునిగిన పంటలను పరిశీలించారు. కొర్ర 230 ఎకరాలు, సజ్జ 30 ఎకరాలు, నువ్వులు 20 ఎకరాలు, కంది 5 ఎకరాలు, వరి 10 ఎకరాల్లో నీట మునిగి రైతులు నష్టపోయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న ఉద్యానవన పంటలను ఉద్యానవనశాఖ అధికారిణి డి.శ్వేత పరిశీలించి జాగ్రత్తలు తెలియజేశారు.



కంభం మండలం యర్రబాలెం వద్ద ఉధృతంగా పారుతున్న గుండ్లకమ్మ వాగు

వర్షానికి కుళ్లిన టమోటా

రాచర్ల: వాయుగుండంతో ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాచర్ల మండలంలో టమోటా పంట దెబ్బతింది. ఆకవీడు, అనుమలవీడు, అనుముల పల్లె, చోళ్లవీడు, గుడిమెట్ట, కొత్తపల్లి, రాచర్ల గ్రామాల్లో కోత దశలో ఉన్న టమోట తోటల్లోకి నీరు చేరడంతో బొబ్బ, పగుళ్లు వచ్చి కుళ్లిపోతున్నాయి. 28 ఎకరాల్లో టమోట పంట దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



కుళ్లిన టమోటాలు చూపిస్తున్న రైతు గల్లా రామకృష్ణ



గుండ్లకమ్మ వద్ద బందోబస్తులో కంభం ఎస్సై నరసింహారావు

నేడు వైఎస్సార్ వర్ధంతి

మార్కాపురం టౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతిని సోమవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు సూచించారు. ఉదయం 9.30 గంటలకు మార్కాపురం పట్టణంలోని పాత బస్టాండ్‌లో, 10 గంటలకు తూర్పువీధిలోని జువ్విచెట్టు వద్ద వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించనున్నట్లు తెలిపారు. మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో పార్టీ నాయకులు వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమాలకు పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, ముఖ్య నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని సూచించారు.

నేడు చినారికట్లలో..

కొనకనమిట్ల: దివంగత సీఎం వైఎస్సార్ 15వ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని చినారికట్ల జంక్షన్‌లో సోమవారం వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు పార్టీ నాయకుడు ఉడుముల గురవారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్ రెడ్డి, పార్టీ జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసుల రెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బుల్లెట్ బైక్ అపహరణ

- సీసీ కెమెరాలో నిక్షిప్తమైన దృశ్యాలు



బైక్ ఎత్తుకెళ్తున్న దొంగలు(సీసీ ఫుటేజీ దృశ్యం)

కంభం: ఇంటి ముందు పార్క్ చేసి ఉన్న బుల్లెట్ వాహనాన్ని దుండగులు అపహరించిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి తర్వాత స్థానిక చౌక్ సెంటర్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. చౌక్ సెంటర్‌లో రాజ్యలక్ష్మి జ్యూయలర్స్ ముందు మంచి కంటి సురేష్‌బాబు తన బైక్‌ను పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి ముగ్గురు యువకులు వచ్చి ఆ బైక్‌ను అపహరించుకెళ్తున్న దృశ్యాలు సీసీ ఫుటేజీలో నిక్షిప్తమయ్యాయి. అలాగే రావిపాడు రోడ్డు సమీపంలో ఓ చిన్న హోటల్ తాళం పగలగొట్టి చోరీకి విఫల యత్నం చేశారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ



ఆలయంలో విచారిస్తున్న ఎస్సై కోటేశ్వరరావు

రాచర్ల: మండలంలోని సోమిదేవిపల్లె గ్రామంలో అభయ ఆంజనేయస్వామి ఆలయంలోకి శనివారం అర్ధరాత్రి దుండగులు ప్రవేశించి హుండీని చోరీ చేశారు. హుండీని ఎత్తుకెళ్లిన దొంగలు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో పగలగొట్టారు. అందులో ఉన్న సుమారు రూ.15 వేల నగదు అపహరించారు. చోరీ ఘటనపై గ్రామస్తులు సమాచారం ఇవ్వగా ఎస్సై పి.కోటేశ్వరరావు వెళ్లి పరిశీలించారు. గ్రామ పెద్దల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆయన వెంట ఏఎస్సై ఆదిశేషయ్య ఉన్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: స్థానిక అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారి మూలవిరాట్‌ను అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈవో, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు సన్మానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: కొమరోలు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నంద్యాల శ్రీనివాసులు పదవీ విరమణ సభను స్థానిక నరవ రోడ్డులోని ఎంబీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి హాజరై ప్రిన్సిపాల్ సేవలను కొనియాడారు. అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బుడతా మధుసూదనరావు, ఆదర్శ విద్యా సంస్థల అధినేత బుడత తిమ్మయ్యయాదవ్, గిద్దలూరు మాజీ సర్పంచ్ దప్పిలి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన బైక్



సంఘటనా స్థలంలో క్షతగాత్రుడు

కంభం: ఆగి ఉన్న పాల ఆటోను బైక్ ఢీకొట్టిన సంఘటన ఆదివారం స్థానిక హైవే రోడ్డుపై చోటుచేసుకుంది. వివరాలు.. హైవే రోడ్డు పక్కనే టీపాయింట్ వద్ద ఓ పాల ఆటో ఆగి ఉండగా అదే సమయంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపు తప్పి ఆటోను ఢీకొట్టాడు. తల, ఇతర శరీర భాగాలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని తొలుత కంభం ప్రభుత్వ వైద్యశాలకు, మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు మృతి



మృతి చెందిన ఆవుల వెంకటరావు

పొదిలి రూరల్: ఆగి ఉన్న ట్రాక్టరును మోటరు సైకిల్ ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి పొదిలి నగర పంచాయతీలోని కాటూరివారిపాలెం సమీపంలో పెట్రోల్ బంకు వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. దర్శి మండలం శామంతపూడికి చెందిన ఆవుల వెంకటరావు(27) వ్యక్తిగత పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై ఒంగోలు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కాటూరివారిపాలెం వద్ద రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టరును వెనుక వైపున ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

హాస్టళ్లలో అప్రమత్తంగా ఉండాలి



కంభంలోని బాలికల ఎస్సీ హాస్టల్లో సూచనలిస్తున్న ఆర్‌ఐఓ

కంభం: తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో హాస్టల్ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్యేకాధికారి, ఇంటర్ బోర్డు ఆర్‌ఐఓ సైమన్ విక్టర్ సూచించారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలితో కలిసి పట్టణంలోని హాస్టళ్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు మంచినీరు, ఇతర సౌకర్యాలు సమకూర్చుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని సూచించారు.

సైనికుల త్యాగాలు యువతకు స్ఫూర్తిదాయకం

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

తర్లుపాడు: దేశ రక్షణ కోసం 30 ఏళ్లపాటు సేవ చేయడం గొప్ప విషయమని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో ఆర్మీ జవాన్ ఆరికట్ల వెంకట నారాయణరెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భముగా వెంకట నారాయణరెడ్డి దంపతులను మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఘనంగా సన్మానించారు. దేశం కోసం ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తిస్తున్న సైనికులను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దేశ రక్షణ, అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు కె.సత్యనారాయణరెడ్డి, గాయం శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు. వైఎస్ జగన్ అభిమానుల ఆధ్వర్యంలో నారాయణరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొశ్చెట్టి జగన్ బాబు, శ్రీనివాసులు, నబీరసూల్, శేఖర్, జనార్ధన్‌రావు, లక్ష్మయ్య, ఎ.శ్రీను, పి.శ్రీను హుస్సేన్ పీరా, మస్తాన్, రత్నకుమార్, ఎలిశమ్మ, రామసుబ్బులు, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్మీ జవాన్ దంపతులతో అన్నా రాంబాబు

విద్యార్థులను తీర్చిదిద్దడంతో అధ్యాపకుల కృషి ఎనలేనిది

పొదిలి రూరల్: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంతో అధ్యాపకుల కృషి మరువలేనిదని ఆర్‌జేడీ వీవీ సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం పొదిలి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ చెరుకూరి తారావాణి పదవీ విరమణ సందదర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్జేడీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదన్నారు. విద్యార్థులు, కాలేజీ ప్రగతికి కృషి చేసి, పదవీ విరమణ చేసిన ప్రిన్సిపాల్ తారావాణి, ఆమె భర్త ఈశ్వరయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పి.నరసింహారెడ్డి, పి.మనోహర్‌బాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పదవీ వీరమణ చేసిన తారావాణి దంపతులను సన్మానిస్తున్న అధ్యాపకులు

210 మద్యం బాటిళ్లు పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై రవీంద్రారెడ్డి

బేస్తవారిపేట: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి తెలిపారు. జేసీ అగ్రహారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 210 క్వార్టర్ బాటిళ్లు, 12 బీర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బేస్తవారిపేట నుంచి చెట్టిచర్ల మార్గంలో తనిఖీలు చేపడుతుండగా నిందితులు పట్టుబడినట్లు తెలిపారు.

తొమ్మిది మంది జూదరులు అరెస్టు

బేస్తవారిపేట: స్థానిక అంబేడ్కర్ కాలనీలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.4,310 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడినా, నాటుసారా తయారు చేస్తున్నా సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.



సీఐని సన్మానించిన ముదిరాజ్ సంఘం



సీఐని సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన రామకోటయ్యను స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ముదిరాజ్ సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. సంఘ నాయకుడు అంకయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి సీఐకి అభినందనలు తెలిపారు.

చెరువును పరిశీలించిన అధికారులు



పిటికాయగుళ్ల చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్ల చెరువును తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంపీడీఓ పార్వతి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. తుఫాన్ సమయంలో పాతమిద్దెలు, పాడుబడిన కట్టడాల్లో నివసించేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉధృతంగా ఉన్న వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని కోరారు. వర్షం వల్ల ఎలాంటి ఇబ్బంది కలిగినా వెంటనే వీఆర్వోలకు సమాచారం ఇవ్వాలని సూచించారు.